క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: పలు మరమ్మతుల కారణంగా బుధవారం 11కేవీ ఖిల్లా మైసమ్మ దేవాలయం ఫీడర్ పరిధిలోని బంజారానగర్, కృష్ణనగర్, బిలాల్ మజీద్, ద్వారకానగర్, గ్రీన్‌హిల్స్‌కాలనీ-1, 2 హరిపురికాలనీ, జనప్రియగార్డెన్, ఖిల్లామైసమ్మ, ఎన్‌టీఆర్‌నగర్, ఎన్‌టీఆర్‌నగర్ దర్గా, ఎన్‌టీఆర్‌నగర్ హనుమాన్ టెంపుల్, సాయిబాబానగర్‌లలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ ఫర్హత్‌అలీ తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన గిరిజన నాయకులు



రామచంద్రునాయక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మహేశ్వరం: రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్‌ను మండల కాంగ్రెస్ గిరిజన నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేస్తుందనిస్ సీనియర్ నాయకుడు మునావత్ పాండునాయక్ అన్నారు. గిరిజనుల పక్షాన నిలబడి పనిచేయాలని డిప్యూటీ స్పీకర్ రామచంద్రు నాయక్‌ను కోరారు. ఆయనను కలిసిన వారిలో నాయకులు మునావత్ దేవేందర్ నాయక్, రవినాయక్ పలువురు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సీహెచ్‌ఓకు సన్మానం



సీహెచ్‌ఓ హాసన్ మొయినుద్దీన్‌ను సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరు పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి(సీహెచ్‌ఓ) హాసన్ మొయినుద్దీన్ పదవీ విరమణ సందర్భంగా సిబ్బంది మంగళవారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని వైద్యులు, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. పదవీ విరమణ అనంతరం జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, యాదమ్మ, మణెమ్మ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవు



హస్తినాపురం: అక్రమ పార్కింగ్‌లతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు హెచ్చరించారు. విజయవాడ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయలకు పార్కింగ్ లేకపోవడంతో వెంటనే పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వనస్థలిపురం పరిసర ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న ప్రైవేటు పాఠశాలలకు రోడ్లపై కాకుండా వెనకాల నుంచి సాయంత్రం వేళల్లో విద్యార్థులను పంపించాలని సూచించామని, అయినా కొందరూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ అవుతుందని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గట్టుమల్లు హెచ్చరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని భవాని ఎన్‌క్లేవ్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం కాలనీలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పీ.ప్రశాంత్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, గాయత్రి, ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, కోశాధికారిగా యంఎన్‌బీ చారి, సంయుక్త కార్యదర్శిగా నరసింహ, స్పందనను ఎన్నుకున్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

మన్సూరాబాద్: డివిజన్ పరిధి ఆదిత్యానగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజలు, అర్చనలు నిర్వహిస్తున్నామని, సమీప కాలనీలవాసులు పెద్ద సంఖ్యలో హాజరై వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఇంకెన్నాళ్లీ అవస్థలు!

- హైదరాబాద్–శ్రీశైలం రహదారిపై నిలిచిన మురుగు, వర్షం నీరు
- కల్వర్టు తొలగించడంతో సమస్య తీవ్రం
- పట్టించుకోని నేషనల్ హైవే అధికారులు



కందుకూరు చౌరస్తాలోని రైస్‌మిల్ ఎదుట రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

కందుకూరు: హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిని విస్తరించి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు మురుగు, వర్షం నీరు పోయే మార్గాన్ని అన్వేషించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో నిత్యం రహదారిపై మురుగుతో పాటు వర్షం కురిసినప్పుడు నీరు నిలిచి ప్రయాణికులకు, స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. అయినా సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకొన్నారే తప్పా, సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపలేకపోయారు. ఇదీ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఉన్న ప్రస్తుత దుస్థితి.

ప్రణాళిక లేకుండా నిర్మాణం

హైదరాబాద్–శ్రీశైలం రహదారిని 2016 సంవత్సరంలో విస్తరించారు. ఆ సమయంలో కందుకూరు చౌరస్తా నుంచి కొత్తగూడ చౌరస్తా మధ్యలో ప్రణాళిక లేకుండా నిర్మాణం చేపట్టింది అప్పటి కాంట్రాక్ట్ సంస్థ. పాత కల్వర్టులను పూర్తిగా తొలగించి రోడ్డు నిర్మించింది. దీంతో పాటు కందుకూరు చౌరస్తా నుంచి కొత్తగూడ చౌరస్తా మధ్యలో రెండు వైపులా పల్లంగా నిర్మించడంతో పాటు అక్కడ రైస్ మిల్ వద్ద ఉన్న కల్వర్టును తొలగించింది. దీంతో అప్పటి నుంచి మురుగుతో పాటు వర్షం నీరు నిలిచి సమస్యగా మారింది. దాదాపు రెండేళ్ల క్రితం స్థానికుల ఆందోళనలతో రోడ్డు కింద నుంచే కల్వర్టు నిర్మించి చేతులు దులుపుకున్నారు. అక్కడి నుంచి నీరు బయటికి పోయే మార్గం లేక ప్రస్తుతం ఆ కల్వర్టు పూర్తిగా నిండిపోయి రోడ్డుపైనే మురుగు, వర్షం నీరు నిలుస్తుంది. దీంతో రాకపోకలు సాగించే వారితో పాటు ఆ సమీపంలోని వ్యాపారస్తులకు మురుగు నీటితో ఇబ్బందికరంగా మారింది. దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు అధికమై అవస్థలు పడుతున్నారు. అయినా సంబంధిత అధికార యంత్రాంగం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తుందని వాపోతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలంటే రోడ్డును హైదరాబాద్ వైపు పల్లంగా నిర్మించి వర్షం నీరు, మురుగు నీరు కింది వైపు ఉన్న పిల్లివాగులోకి తరలించడమే ఏకైక మార్గం. ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే సబితారెడ్డి విమర్శించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ హాల్‌లో తహసీల్దార్ గోపాల్ ఆధ్వర్యంలో 31 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి పథకంతో పాటు అదనంగా తులం బంగారం ఇస్తామని చెప్పారని, ఇప్పుడు ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో మాజీ సీఎం కేసీఆర్ ముందున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్లు పి.ఆనంద్, ఎస్.శేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు టి.ఇందిరదేవేందర్, సీనియర్ నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథముదిరాజ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, జి.సురేష్, మాజీ సర్పంచులు కె.రామకృష్ణారెడ్డి, జి.గోపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, జంగయ్య, పారిజాతం, నరేందర్‌గౌడ్, మస్కు బాబు, మాజీ డైరెక్టర్లు ప్రకాష్‌రెడ్డి, దేవీలాల్‌నాయక్, నాయకులు బి.దీక్షిత్‌రెడ్డి, టి.కార్తీక్, జి.సామయ్య, దర్శన్‌రెడ్డి, వెంకటేష్, ఆలీ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



కందుకూరు పీహెచ్‌సీలో వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశవర్కర్లు

కందుకూరు: కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 9న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్, ఆశ వర్కర్ల సంఘం జిల్లా నాయకురాలు సరస్వతి కోరారు. ఈ మేరకు మంగళవారం కందుకూరు, రాచులూరు పీహెచ్‌సీల్లో ఆశవర్కర్లతో కలిసి వైద్యులకు డిమాండ్లతో కూడిన వినతి ప్రతాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయని విమర్శించారు. హక్కులను సాధించుకునే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు ముంతాజ్‌బేగం, శ్రీలత, రాధిక, లక్ష్మమ్మ, యాదమ్మ, జయసుధ, సురేఖ, భాగ్యలక్ష్మీ, కలమ్మ, వినోద, అనిత, వెంకటమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజ్ నిర్మాణంతో ముంపు సమస్యకు చెక్

నాగోలు: బండ్లగూడ అయ్యప్పనగర్ కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నూతన డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం నాగోలు డివిజన్ బండ్లగూడ పరిధిలోని అయ్యప్పనగర్ కాలనీలో జలమండలి, ఇరిగేషన్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. డ్రైనేజీ, రోడ్ల సమస్యల గురించి స్థానికులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో పైనుంచి వచ్చే వరదనీటి సమస్యల కోసం ఈ కాలనీ గుండా బాక్స్ డ్రెయిన్ వేయడం జరిగింది ఈ పనులతో ఈ కాలనీకి ముంపు సమస్య తప్పిందన్నారు. అందుకు అనుగుణంగా బండ్లగూడ చెరువు తూములను ఏర్పాటు చేయడం వల్ల పై నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని నాలాల ద్వారా మూసీలోకి మళ్లించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేష్ బాబు, శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, సతీశ్, కాలనీవాసులు నర్సింహాచారి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఆమనగల్లు అభివృద్ధికి కృషి



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలో రూ.25 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆమనగల్లును ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో రూ.26 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు ఓపెన్ జిమ్‌లను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లులో అభివృద్ధి అంతగా జరగలేదన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నామని చెప్పారు. మరో రూ.15 కోట్లతో పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. నిధుల విడుదలకు అవసరమైతే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి మంజూరు చేపిస్తామని స్పష్టం చేశారు. త్వరలో మున్సిపాలిటీలో ప్రత్యేక సమావేశం నిర్వహించి అభివృద్ధిపై చర్చిస్తామని తెలిపారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

పట్టణంలో రాజీవ్ చౌరస్తా నుంచి సందబావి వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత, రాష్ట్ర చెంచు యువజన సంఘం అధ్యక్షుడు రాములు, డైరెక్టర్లు శ్రీశైలం, పాండురంగయ్య, రవీందర్, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, పీసీబీ మాజీ సభ్యుడు బాలాజీసింగ్, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఏఈ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు సత్యనారాయణ, దామోదర్, అఫ్రోజ్, ఉపేందర్‌రెడ్డి, ఎల్లయ్య, ఎస్ఐ వెంకటేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు నర్సింహ, శ్రీకాంత్, మానయ్య, విజయ్, ఖాదర్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవాచారి

చంపాపేట: స్వర్ణకారులను ఆదుకునేందుకు ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణ లోనూ స్వర్ణకార సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఉపాధి కోల్పోయి స్వర్ణకారులకు అండగా నిలవాలని రాష్ట్ర స్వర్ణకార సంఘ అధ్యక్షుడు వింజమూరి రాఘవాచారి డిమాండ్ చేశారు. మంగళవారం చంపాపేటలోని సంఘ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వర్ణకార చేతి వృత్తిదారుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని స్వర్ణకారులకు ఉపాధి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారిలో విశ్వబ్రాహ్మణ స్వర్ణకారుల పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన స్వర్ణకారులపై గత, ప్రస్తుత పాలకులు శీతకన్నుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉపాధి కోల్పోయి 50 ఏళ్లు నిండిన ప్రతీ స్వర్ణకారుడికి ప్రభుత్వం పెన్షన్ అందచేయటంతో పాటు జీఓ నెంబర్ 272 ను సవరణ చేసి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో రత్నమాచారి, లక్ష్మణాచారి, సతీష్‌చారి, వెంకటాచారి, రమేష్‌చారి, నాగరాజు, రామకృష్ణ, భీష్మాచారి, గోవర్ధన్‌చారి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీనివాస్



కార్మికులకు వస్తువులు అందజేస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్, కమిషనర్ వాణి

తుక్కుగూడ: పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ ప్రత్యేకాధికారి భోనగిరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పుర కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, నూనె, మాస్కులు, హ్యాండ్ గ్లౌసులు తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి వస్తువులు అందజేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి పవిత్రమైంది

మలక్‌పేట: సమాజంలో వైద్య వృత్తి కీలకమైందని, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, కొత్తపేట్ క్లబ్ స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ లయన్ గూటి హిజ్కియా అన్నారు. మలక్‌పేట ప్రొఫెసర్స్ కాలనీలోని సెయింట్ జేవియర్స్ హైస్కూల్లో జరిగిన డాక్టర్స్ డేకు ఆయన హాజరై విద్యార్థులు సిబ్బందితో కలిసి సేవా కార్యక్రమాల్లో పాల్గొని వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు డాక్టర్ల వేషధారణలో వైద్యవృత్తి ప్రాముఖ్యతను ప్రదర్శన ద్వారా వివరించారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

లింగోజిగూడ: కార్మికుల సమస్యలు పరిష్కరించడంతో పాటు కనీస వేతనలు అందజేయాలని చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సిరెడ్డి కోరారు. జీహెచ్‌ఎంసీలో పని చేస్తున్న కార్మికులకు సమ్మెలో రెండు గంటల పాటు పాల్గొనే విధంగా ఆదేశాలు జారీ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి కోరారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న పురుషోత్తం

బడంగ్‌పేట్: శిగాచీ కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన పేలుళ్లలో 37 మందికి పైగా కార్మికులు మరణించారని ఆ కుటుంబాలను ఆదుకోవలసిన బాధ్యత కాంగ్రెస్ సర్కారుపై ఉందని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ రాష్ట్ర అధ్యక్షుడు బొద్రమోని పురుషోత్తం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. చనిపోయిన కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కరికి కోటి నష్ట పరిహారం ప్రకటించడం సంతోషదాయకమే అన్నారు. అలాగే గాయపడిన కార్మికులకు రూ.50లక్షల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో సేఫ్టీ జాగ్రత్తలు పాటించని యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామిక వాడల్లో నాణ్యతలేని ఫ్యాక్టరీలను మూసి వేయాలని డిమాండ్ చేశారు. అసువులు బాసిన కార్మికులకు పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరోమారు పారిశ్రామిక వాడల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఇంద్రాల శేఖర్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి సురేశ్, ఇన్‌చార్జి పి.జ్యోతి, ఝాన్సీ, బానుప్రసాద్ ఉన్నారు.

ఏఎల్‌ఎంటీలకు ఓటర్ల సర్వేపై శిక్షణ



ఏఎల్‌ఎంటీలకు శిక్షణ ఇస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు: ఇంటింటి సర్వేలో భాగంగా ఓటర్ల లిస్టులో తప్పొప్పులు సరిచేయడంతో పాటు మార్పులు, చేర్పులు చేయడం తదితర అంశాలపై మంగళవారం కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిక చేసిన అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్లకు(ఏఎల్‌ఎంటీ) శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారంతా ఈ నెల 3 నుంచి 17వ తేదీ వరకు ఆయా మండలాల్లోని బీఎల్‌ఓలకు శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. శిక్షణ పొందిన బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేపట్టి ఓటర్ల లిస్టులో తప్పొప్పులు సరి చేయడంతో పాటు తొలగింపులు, మార్పులు, చేర్పులు చేస్తారన్నారు. ఆ దిశగా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్లు శేఖర్, తాజుద్దీన్, ఏఎల్‌ఎంటీలు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన పార్కుస్థలం స్వాధీనం

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని మల్లికార్జున్ హిల్స్‌లో పార్క్ స్థలం కబ్జా కావడంతో అసోసియేషన్ సభ్యులు పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. ఈ విషయంపై పూర్తి ఆధారాలతో హైడ్రా కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. స్పందించిన హైడ్రా అధికారులు నాగోలులోని మల్లికార్జున హిల్స్‌లోని కబ్జాకు గురైన పార్క్ స్థలాన్ని పరిశీలించారు. మంగళవారం హైడ్రా ప్రొటెక్షన్ బృందం వచ్చి పార్కు స్థలంలో బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు పి.యాదయ్య మాట్లాడుతూ.. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి పార్క్ స్థలాన్ని కాపాడిన హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు అన్నారు.



స్థలాన్ని స్వాధీనం చేసుకొని బోర్డు ఏర్పాటు చేసిన హైడ్రా అధికారులు

దారంతా చెత్త.. రోడ్డంతా మురుగు

పేరుకుపోతున్న వ్యర్థాలు | పొంగుతున్న డ్రైనేజీలు



మన్సూరాబాద్ కేబీఆర్ రోడ్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలు

ఎల్‌బీనగర్: సిబ్బంది నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపం నియోజకవర్గంలోని పలు కాలనీలలో ప్రజలకు శాపంగా మారుతోంది. వర్షాకాలంలో ప్రజలు రోగాలబారిన పడే అవకాశం అధికంగా ఉంటుంది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా జీహెచ్‌ఎంసీ పరిధిలో మాన్సూన్ బృందాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునే విధంగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా కిందిస్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మాన్సూన్ బృందాలు ఫిర్యాదుల కోసం ఎదురు చూడకుండా కాలనీల్లో పర్యటించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మురుగుతో దుర్వాసన..

నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకే డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగి మురుగు ఏరులై పారుతోంది. దీంతో రోడ్లు మురుగునీటి కాలువలను తలపిస్తున్నాయి.అటుగా వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు వేగంగా వెళ్తుండటంతో మురుగు మీద పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ముందే డ్రైనేజీ పైప్‌లైన్, నాలాల్లో పేరుకుపోయిన పూడికను తీయాల్సి ఉండగా తూతూ మాత్రంగా పనులు చేసి వదిలేశారని పలు కాలనీ పంక్షేమ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మ్యాన్‌హోల్ పొంగడంతో రోడ్డుపై పారుతున్న మురుగు

పర్యవేక్షణలోపంతో..

నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ప్రధాన రహదారుల్లో చెత్త పేరుకుపోయి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.ఎప్పటికప్పుడు తొలగించాల్సిన చెత్తను రెండు మూడు రోజులకు ఒక్కసారి తొలగిస్తుండడంతో చెత్త నుంచి దుర్వాసన వస్తుందని అటుగా వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉంటుందని ఆయా కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త పేరుకుపోతుండటంతో దోమల వ్యాప్తితో కంటిమీద కునుకు లేకుండా పోతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించి డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.